# సర్వమానవ సౌభ్రాతృత్వము

(బసంత్ 23.1.1996)

ఎప్పుడైతే ఒక వ్యక్తి నాకు భర్తనో లేక భార్యనో లేక పుత్రుడో లేక సోదరుడో లేక నాకు కావలసిన వాడో అనే ఒక ఉద్దేశంతో అతనికి యీ సిద్ధాంతం గురించి చెప్పడం గాని, యీ పద్ధతి గురించి చెప్పడం గాని చేయడంలో తప్పులేదు కాని, ఆ సోదర ప్రేమ గాని లేక ఆ అనుబంధం గాని వాళ్లకు మాత్రమే పరిమితమైనట్లు యున్న స్థితి అంత ఉన్నతమైనది కాదు. అందరినీ సోదరులుగా భావించి వారి యెడల ఆ విధముగా ప్రవర్తించుము అనేది మన ఆరవ ఆదేశము.. అంటే మన యీ ఆత్మత ఏదైతే వుందో అది అందరికీ వర్తించాలి. అలా కాక మన చుట్టూ వున్న వాళ్లకు పరిమితం చేసినప్పుడు మనకు సర్వసాధారణంగా కలిగేదేమిటంటే ఒకవిధమైన నిరుత్సాహమే. ఎందుకంటే మనము చేసినట్లు వాళ్లు సాధన చేయడం లేదు. ఎందుకు చేయటంలేదనేది ఒకటి వాళ్ల సంస్కారం బట్టి వుంటుంది, రెండవది వాళ్లు ఎందుకు చేయాలి అనే ప్రశ్నకు కూడ జవాబు వుండదు. అలా కాకుండా అధ్యాత్మికపరంగా సమస్త స్త్రీ పురుషులు మన సోదరీ సోదరులని భావించి వారిలో నిజమైన భక్తి మరియు విశ్వాసము పెంపొందుచున్నవని ఏదైతే మనకు 'A' బిందువుపైన ధ్యానములో చెప్పబడ్డదో, దాన్ని నిర్విరామంగా, నిరంతరంగా వదలకుండా పట్టుదలతో ఆ ప్రార్ధన గాని మనము చేస్తే మన చుట్టూ వున్న వాళ్లే కాకుండా ప్రపంచములో వున్న వాళ్లందరుకూడా దేవునివైపు వాళ్లయొక్క మదిని మరల్చగల్గుతారు. అది యీ సంస్థ ద్వారా జరుగుతుందా, యితర సంస్థ ద్వారా జరుగుతుందా లేక వారికి వారే చేరుతారా అనే ముచ్చట మనకు అనవసరము. మనకు కావలసిన ధ్యేయమేమిటంటే మానవ మేధస్సు భగవత్ పరం కావాలి. భగవంతునియెడల ప్రేమ పెంపొందించుకోవాలి. భగవంతుడు ఒక్కడే మనందరికీ తండ్రి అనే జ్ఞానం రావాలి. ఈ జ్ఞానం ఎప్పుడైతే అందరిలో కలుగుతుందో విశ్వశాంతి అనేది ఒకటి సాధ్యము. అంతవరకు విశ్వశాంతి గురించి మాట్లాడటం వొట్టి మాటలే. మనం ఎంతమందికి చెప్పినా వాళ్లు వినరు. మాటల ద్వారా మానవ పరిణామము వీలుకాదని మనకు యిప్పుడు ఆరు వేల సంవత్సరముల చరిత్ర చెబుతున్నది. ఆరువేల సంవత్సరములుగా చరిత్రలో మనకు జరిగిందేమిటంటే ఒక బైబిల్ వచ్చింది, ఒక ఖురాన్ వచ్చింది, ఒక భగవద్గీత వచ్చింది, వేద శాస్త్రాలు వచ్చినాయి. వీటి గురించి వ్యాఖ్యానాలు వచ్చినాయి, వ్యాఖ్యాతలు వచ్చారు, ఆచార్య పురుషులు వచ్చారు. అందరూ వచ్చి చేసింది ఏమిటి అంటే మనలో మనకు వైషమ్యాలు పెంచారు. వీడు వైష్ణవుడు, వాడు శైవుడు, వాడు హిందువు, వీడు బౌద్ధుడు, వీడు ముస్లిమ్, వాడు క్రైస్తవుడు, వాడు పార్సీ, వీడు ఆటవికుడు అని మనయొక్క ఆలోచనా సరళి అయిపోయింది. ఎవరి గొప్పతనం వారిది. దీనికన్నిటికీ కలిపి యిప్పుడు చెప్పబడ్డ సమాధానము ఏమిటంటే వేదాంతపరంగా

వాళ్ళేదైతే మేధావులు అంటున్నారో, వాళ్ళు చెప్పేదేమిటంటే అంతా ఒక్కటే, అనవసరంగా మాట్లాడవద్దని. అంతా ఒక్కటే యని మనము ఎంత చెప్పినా, అంతా ఒక్కటే కాదని మన మనస్సులో తెలుసు. చెబుతాం అంతా ఒకటే యని. అంతా ఒకటే అయితే యీ సమస్య ఎందుకు వచ్చింది. ఈ అంతా ఒక్కటే అనే భావం కలుగదు, మానవ మేధస్సుకు అంత సామర్ధ్యము లేదు. ఇది లోపల అంతరాత్మలో జరుగవలసిన మాట అన్నదాన్ని యిప్పుడు బాబూజీ గారు చెబుతున్నారు. ఇది మానవుడు తనకు తానే చేయలేని ఒక పని అని కూడ చెప్పారు. అందుకే దివ్యత్వము నేరుగా యీ రోజు మనకు దిగివచ్చి మన హృదయాంతరాల్లో వుండి, మనల్ని మలచడానికి ఒక పురుష మేధం జరిగింది. ఒకప్పుడు పురుష సూక్తంలో పురుష మేధం జరిగిందంటారు. అప్పుడు జరిగిందో లేదో నాకు తెలియదు కాని యిప్పుడైతే జరిగింది. మనం ప్రతిఒక్కరూకూడ అనుభవించేది ఆ పురుష మేధాన్నే. ఏదైతే మనము ప్రాణాహుతి అని అంటున్నామో అది మహా ఆహుతి. మార్పు మన వల్ల కాదు, మనము చేయలేము. బంధుమిత్రులు వీళ్లంతా మాతో మారవచ్చుగదా అని చెప్పడము చాలా సంతోషమైన విషయమే. జరిగితే అంతకంటే సుఖము లేదు. జరుగుతుందని నేను నమ్మను. జరిగినా మనము అనుకున్నట్లు అది జరగవలసిన అవసరమూ లేదు. మనకు కావల్సిందేమిటంటే భగవత్పరంగా మానవ మేధస్సు వెళ్ళాలి, మానవుడు భగవత్పరంగా ప్రేమ పెంచుకోవాలి, తద్వారా తన చుట్టూ వున్నవాళ్లందరికి కూడ, ఒక మానవ సేవ అనేది భగవత్సేవ క్రింద వస్తుంది. త్యాగము గాని, సేవగాని అప్పుడే అర్థము అవుతుంది. అయితే, ఈ ఆధ్యాత్మికపరంగా ఎదుగుదల ఎప్పుడు? ఎప్పుడైతే మనము ఒక చిన్న కుంచిత పరిధిలో ఆలోచిస్తామో ఆ ఆలోచన పోయింది. అంతకంటే వున్నతమైన ఆలోచనకి అవకాశము వున్నది. ఎందుకూ? ఆ స్థాయికి మనము పెరిగాము కాబట్టి. అక్షి, కస్బి రెండు పదాలు వున్నాయి మనకు. బాబూజీ గారి సిద్ధాంతంలో యీ స్థితి వరకు వెళ్లగలడు అనేది అక్షి, వెళ్ళినాడు అన్నది కస్బి. Bankలో account మనకు వుంది draw చేయవచ్చును కానీ నీవు వ్యవహార యోగ్యుడు కాలేదు, యోగ్యుడయిన తరువాత draw చేయి. ముందునుంచి మన ఖాతాలో balanceలో వుంది. మనదే, యిచ్చాడు కానీ అది అక్షి. ఎప్పుడైతే మనకు సామర్ధ్యత పెరిగిందో, మనకు అర్హత వచ్చిందో 18 ఏళ్లయినామో adult అని చెప్పినాడో అప్పుడు అది కస్బి. ఇది వ్యావహారిక రూపంగా ఒక ఉపమానంగా చెబుతున్నాను. ఉపమానాన్ని వూరికే లాగకండి. ఉపమానాల్ని అంతవరకే అర్థం చేసుకోవాలి. ఉపమానం ఒక విధానం ఉద్దేశిస్తుందంతే. అలాగ మన condition, అంటే ఏమిటి? ప్రతిఒక్కరు కూడ, ఈ సంస్థలో చేరిన ప్రతిఒక్కరు కూడ "A' బిందువుపై ధ్యానము చేసే అర్హత కలిగినవాడు చేస్తున్నాడా లేదా అన్నదే ప్రశ్న. ఎప్పుడైతే నాకున్న అవకాశాన్ని నేను సద్వినియోగము చేసుకొని ఆ వున్నత స్థితిలో, చైతన్యత అనేది మనయొక్క చైతన్యత మనవైపు, మన జీవితం వైపు, మన చుట్టూ వున్నవాళ్ళ జీవితం వైపు పరిభ్రమిస్తూ వుంటుందో అది

స్వార్థ చైతన్యత. అలాకాకుండా పరమార్థ చైతన్యత లేక విశ్వ చైతన్యత ఎప్పుడు వస్తుందంటే, యితరుల గురించి ఆలోచించగలిగిన ఒక సామర్థ్యము కలిగినప్పుడు నీకు ఆ సామర్థ్యము వుంది అని చెబుతున్నాడు ఆయన. సామర్థ్యము నిరూపించుకోవలసిన అవసరము సాధనద్వారా మనకుంది. అటువంటప్పుడు మన సంకల్పము కాదది. సాధారణంగా మన సంకల్పాలన్నీ కూడ మన యిష్టాలకు వుంటాయి, మన అభీష్టాలు కోరుతుంటాయి. మనం ఏది సంకల్పం చేసినా మన స్వార్థపూరితమైన కోరికలకు సంబంధించి వుంటాయి. విశ్వ శాంతి, మానవ శాంతి కోరేది మన సంకల్పము కాదు, అది దైవీసంకల్పము. ఆ దైవీ సంకల్పము చేయగలిగిన సామర్థ్యము, అర్హత మీకు వుంది. స్వానుభవంతో దానిని ఆ స్థితిలో మీరు వుంచగలిగితే మీ సాధన మీకు పరిపక్వమౌతుంది. మీ సంకల్పము అప్పుడు దైవీ సంకల్పముతో కలుస్తుంది. ఎందుకంటే యిది మన సంకల్పము కాదు, యితరుల మంచికోరడమనేది జీవికి సాధారణము కాదు. ఎప్పుడూ మన గురించి మనము ఆలోచిస్తాము యితరుల గురించి మనము ఆలోచించము. ఇతరుల గురించి మనము అలోచించినప్పుడు కూడ ఆ వ్యక్తివల్ల మనకు ఏదైనా ఉపయోగము వుందా లేదా అన్న ఒక ఉద్దేశముతో మాత్రమే ఆలోచిస్తాము. అందువల్లనే మనము మొదట్లో మన చుట్టూ వున్నవాళ్లను చేర్పిస్తామని అంటాము. అలా కాకుండ తెలియని యే వ్యక్తి, అలాస్కాలో వున్న వ్యక్తో లేదా అట్లాంటాలో వున్న వ్యక్తి గురించి మనము యిక్కడ కూర్చొని వాడు బాగుపడాలనే కోరిక అంత సహజంగా ఎవరికీ రాదు. అది మానవ సహజం కాదు, అది దైవ సహజం. అటువంటి ఒక సంకల్పానికి, ఒక స్థితికి మనము ఎదగగలిగితే, ఆ సంకల్పస్థితికి ఎదగగలిగితే అప్పుడు మన సంకల్పము ఆయన సంకల్పమవుతుందే గాని, మన సంకల్పమంటూ వేరేగా వుండదు. మనము చేసే ప్రతిపనిలో కూడ సమగ్రంగా దాని ఒక involvement వుంటుంది. మీ అందరికి కూడ నేను చెప్పగలిగిందొక్కటే, మీయొక్క స్వార్థ చింతన తగ్గి పరార్థ చింతన పెరిగినప్పుడు మానవ సంకల్పము ఈశ్వర సంకల్పమవుతుంది, ఈశ్వర సంకల్పమే మానవ సంకల్పమవుతుంది, ఈ రెండిటికీ తేడా లేదు. మనయొక్క జన్మసిద్ధ అధికారము ఏమిటంటే to become Gods, to become Iswaras, అది జన్మసిద్ధ అధికారము. ఆ జన్మసిద్ధ అధికారముకి యిన్నిరోజులూ కూడ మనము అవస్థ పడినాము. నేను దోహదపడుతాను అంటాడు ఆయన. అటువంటి సహాయాన్ని పొంది మనమందరమూ కూడ అనుభవిస్తున్నాము ఎంతోకొంత ఆధ్యాత్మిక పురోగతి మనము అనుభవిస్తున్నాము కాబట్టి అటువంటి దాన్ని యితరులతో పంచుకోవలసిన అవసరం ఎంతైనా వుంది కాబట్టి పంచుకోవాలని ఆయన కోరాడు, నేనూ కోరుతున్నాను.

కే.సి.నారాయణ